నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 28 జనవరి 2024 | SURYAPET

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

జాన్‌పహాడ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పాలకవీడు, జనవరి 27 : మూడు రోజుల పాటు జరిగిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారం దీపారాధనతో ముగిసింది. తొలిరోజు లక్షకు పైగా వచ్చిన భక్తులు మూడో రోజూ వేల సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. సైదులు బాబా సమాధుల వద్ద చాదర్లు సమర్పించారు.

అందుబాటులో ఆరుతడి విత్తనాలు

• రీజనల్ మేనేజర్ కృష్ణవేణి

మిర్యాలగూడ రూరల్, జనవరి 27 : యాసంగి సీజన్‌కు ఆరుతడి విధానంలో సాగు చేసేందుకు వివిధ రకాల అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు నందిపహాడ్ విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ ఆర్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ -6కే రకం విత్తనాలు 30 కిలో బ్యాగు ధర రూ.2,865, శనగ -జేజీ-11 రకం 25 కిలోల బ్యాగు రూ. 1,875, మినుములు పీయూ-31రకం 4 కిలోల బ్యాగు రూ.424, పెసర ఎంజీజీ-295 రకం 4 కిలోల బ్యాగు రూ.432.40 , పొద్దుతిరుగుడు విత్తనాలు 6 కిలోలు రూ. 449.10 ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు మిర్యాలగూడ పట్టణ శివారులోని విత్తనాభివృద్ధి సంస్థ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్‌పై వీగిన అవిశ్వాసం

సూర్యాపేట మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు బీజేపీతో కలిసి కాంగ్రెస్ కుట్ర

- విపక్షాల ఎత్తులను తిప్పికొట్టిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- తీర్మానానికి నోటీసు ఇచ్చింది 32 మంది..
- ఓటింగ్‌కు ఒక్కరూ హాజరుకాలేదు
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌గా కొనసాగనున్న పెరుమాళ్ల అన్నపూర్ణ, పుట్ట కిశోర్

సంబురాలు జరుపుకొంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్, బీఆర్ఎస్ శ్రేణులు

సూర్యాపేట, జనవరి 27 (నమస్తే తెలంగాణ) /బొడ్రాయిబజార్ : సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. విపక్షాలన్నీ ఏకమై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను దించి, ఆ స్థానాలను కైవసం చేసుకోవాలని పన్నిన కుట్రను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వమ్ము చేశారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు స్థానిక ప్రజలు సంబురాలు జరుపుకొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ ఏకమై..

నాలుగేండ్ల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సరిపడా మెజారిటీ వచ్చింది. సూర్యాపేట జనరల్ స్థానం అయినప్పటికీ అప్పటి విద్యుత్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆ స్థానంలో ఎస్సీ మహిళా కౌన్సిలర్ పెరుమాళ్ల అన్నపూర్ణను చైర్‌పర్సన్‌గా, తెలంగాణ ఉద్యమ నాయకుడు పుట్ట కిశోర్‌ను వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. వీరి ఆధ్వర్యంలో నాలుగేండ్లపాటు మున్సిపాలిటీ పాలన సజావుగా కొనసాగింది. ఇటీవల ప్రభుత్వం మారిన వెంటనే కాంగ్రెస్, బీజేపీలు ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు పెట్టి ఆయా స్థానాలను కైవసం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నాయి. ఈ క్రమంలో సూర్యాపేట మున్సిపాలిటీలో కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ తమవైపునకు తిప్పుకొంది. దాంతో పాటు బీజేపీ, బీఎస్పీకి చెందిన వారితో కలిపి 32 మంది కౌన్సిలర్ల మద్దతుతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి నోటీసు ఇచ్చారు. సూర్యాపేటలో 48 వార్డులు ఉండగా బీఆర్ఎస్‌కు 24, కాంగ్రెస్ 15, బీజేపీ 5, ఇండిపెండెంట్లు ముగ్గురు ఉన్నారు. ఒక కాంగ్రెస్ కౌన్సిలర్‌కు ప్రభుత్వ ఉద్యోగం రాగా ఆయన రాజీనామా చేశారు. సూర్యాపే ట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి ఓటు హక్కు కలిగి ఉండడంతో కౌన్సిల్‌లో 48 ఓట్లు ఉన్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పలువురు కౌన్సిలర్లు పార్టీలు మారారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి నెగ్గాలంటే 32 మంది(మూడో వంతు) కౌన్సిలర్లు ఓటు వేయాలి. దాంతో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు ఏకమై కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లకు ఎరవేసి 32 మందితో సంతకాలు చేసి చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాం ప్రతిపాదిస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్‌కు వినతిపత్రం అందించారు. సదరు తీర్మానంపై ఈ నెల 27న ఓటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే ఓటుతో కలిపి 16 మంది మద్దతు ఉంది.

17 రోజుల క్యాంపు రాజకీయాలు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి నోటీసు ఇచ్చిన అనంతరం కాంగ్రెస్ పార్టీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. తమ పార్టీతో పాటు బీజేపీ, బీఎస్పీకి చెందిన 32 మంది కౌన్సిలర్లను హైదరాబాద్, గోవాతో పాటు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లింది. ఇందుకు నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు పర్యవేక్షించగా సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. క్యాంపుకు వెళ్లిన 32 మందిలో బీజేపీ కౌన్సిలర్లు ముగ్గురు రెండు రోజుల ముందు తాము అవిశ్వాసానికి దూరంగా ఉంటామంటూ గేమ్ ఆడి బీఆర్ఎస్ శిబిరంలో చేరారు. మరుసటి రోజు ఇప్పుడే వస్తామని బయటకు వెళ్లి తిరిగి రాలేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. ఆ ముగ్గురికీ హైదరాబాద్ సీఎం చాంబర్ కేంద్రంగా ఫ్లైట్ టిక్కెట్లు బుక్ చేశారని, అందుకే తాము బీఆర్ఎస్‌కు మద్దతిచ్చినట్లు నమ్మించి మైండ్‌గేమ్ ఆడించి దుకు కుట్ర చేశారని వారు పేర్కొంటున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చక్రం తిప్పడంతో వారి కుట్రలు సాగలేదు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన అవిశ్వాస తీర్మానానికి ఓటింగ్ నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చొరవతో అవతలి శిబిరం నుంచి ఒక కౌన్సిలర్ బీఆర్ఎస్ శిబిరంలోకి వచ్చినట్లు తెలిసింది. దాంతో విపక్ష కూటమి బలం 31కి పడిపోగా వారు హాజరైనా ఫలితం ఉండదని భావించి సమావేశానికి రాలేదని సమాచారం. దాంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు కలెక్టర్ ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్‌గా పుట్ట కిశోర్ కొనసాగనున్నారు.

దళిత సంఘాల నేతల ముందస్తు అరెస్టు

దళిత మహిళా చైర్ పర్సన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దళిత సంఘాల నాయకులువారం రోజులుగా నిరసన తెలుపుతున్నారు. అయితే శనివారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు వివిధ దళిత సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని నాగభూషణం, మహిళా నాయకులు కంచి సరిత, మారపాక ఉప్పలమ్మ, బానోతు నీలమ్మ, బొడ్డు రజని, అనుములపురి భాను ఉన్నారు.

ఓటింగ్‌కు హాజరుకాని కౌన్సిలర్లు

సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌పై పలువురు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ కోసం జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధ్యక్షతన శనివారం మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు 144 సెక్షన్ విధించడంతో పాటు మున్సిపల్ కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న అధికారులు 11 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణపై అవిశ్వాస తీర్మానానికి ఓటింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అయితే కౌన్సిలర్లు ఒక్కరు కూడా హాజరు కాక పోవడంతో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సమావేశాన్ని మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కిశోర్‌పై అవిశ్వాసానికి 12 గంటలకు ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించగా.. అందుకు కూడా కౌన్సిలర్లు రాక పోవడంతో తిరిగి 4 గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, 4 గంటలకు వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌పై అవిశ్వాస తీర్మానాలకు ఓటింగ్ నిర్వహించగా కౌన్సిలర్లు ఒక్కరు కూడా రాక పోవడంతో సదరు అవిశ్వాస తీర్మానాలు వీగి పోయినట్లు జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ ప్రకటించారు.

ధర్మం గెలిచింది

సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట మున్సిపాలిటీలో ధర్మ గెలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మున్సిపాల్టీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై విపక్షాలు పెట్టిన అవిశ్వాసం వీగి పోవడంతో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి జనరల్ స్థానంలో ఎస్సీ మహిళకు అవకాశం కల్పించారన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఎమ్మెల్యే సహకారంతో కౌన్సిలర్లను కలుపుకొని పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. విపక్ష నేతలు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లను బెదిరింపులకు గురి చేసి అపవిత్ర కలయికతో అవిశ్వాసం పెట్టారని ఆరోపించారు. తనపై నమ్మకంతో దానిని వీగిపోయేలా చేసిన కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సంవత్సరంలో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మాన సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై జడ్పీచైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు చాడ కిషన్‌రెడ్డి, సైదులు గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

ఓట్లేసినందుకు చెప్పుతో కొడతారా?

- హామీలు అమలు చేయలేక మంత్రుల బూతులు
- పాలన చేతగాక కేసీఆర్‌పై నిందలు
- కృష్ణాజలాలు తరలించుకుపోతున్నా పట్టింపు లేదు
- ఎస్ఆర్ఎస్పీలో నీళ్లున్నా రైతులకు ఇస్తలేరు
- కేసులు, దాడులకు భయపడేది లేదు
- బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేద్దాం
- త్వరలోనే నల్లగొండకు అధినేత కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- నల్లగొండ బీఆర్ఎస్ మీటింగ్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- పెద్దఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించినందుకు ప్రజలను చెప్పులతో కొడతారా? అని మంత్రులను బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల్లో అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి ఇప్పుడు అమలు చేయలేక ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తే తట్టుకోలేక అసహనంతో మంత్రులు బూతులు మాట్లాడుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుబంధు డబ్బులు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చి రూ.10 వేల చొప్పున కూడా ఇవ్వలేకపోతున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. రైతుబంధు డబ్బులు అందడం లేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొడతామనడం కాంగ్రెస్ మంత్రుల అహంకారానికి నిదర్శమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవలే లోక్‌సభ నియోజక వర్గాల వారీగా సమీక్షలు పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలకు సన్నద్ధమైంది. అందులోభాగంగా శనివారం నల్లగొండలో నియోజకవర్గ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. గత నెల 9న సోనియాగాంధీ జన్మదినం నుంచే అమలు చేస్తామన్న రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. హామీలు అమలుచేయలేక, పాలన చేతకాక కేసీఆర్‌పై నెపం నెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఇక హామీల అమలు గురించి ప్రశ్నిస్తే మంత్రులు వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, తాము అదే దారిలోకి వస్తే కాంగ్రెస్ మంత్రులు తట్టుకోలేరని హెచ్చరించారు. కేసులు, దాడులతో భయపెట్టాలని చూస్తున్నారని, తమ పార్టీ శ్రేణులకు, తమకు అవి కొత్తేమీ కాదని, ఉద్యమకాలం నుంచే ఇలాంటివి తట్టుకుని నిలబడ్డామని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉండగా ఇలాంటి వాటిని ప్రోత్సహించలేదని, అధికారం శాశ్వతం కాదని హితవు పలికారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అప్పుడే కరెంటు కోతలు మొదలయ్యాయని, మహాలక్ష్మి పథకంతో జుట్టు పట్టుకునేలా చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లిందని, ఆయన రాష్ట్రాన్ని సొంత కుటుంబంలా భావించి తీర్చిదిద్దారని తెలిపారు. కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందని స్పష్టం చేశారు.

హారతులు పట్టిన హీనులు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కృష్ణా జలాలను నాటి ముఖ్యమంత్రులు వైఎస్, చంద్రబాబు అక్రమంగా తరలించుకుని పోతుంటే హారతులు పట్టిన చరిత్రహీనులు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పెద్దలని విమర్శించారు. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు ఇవ్వలేక పోతున్నారని అన్నారు. ఇక ఎస్ఆర్ఎస్పీలో నీళ్లున్నా వాటిని వినియోగించుకునే తెలివి లేదన్నారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సాగునీళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. నల్లగొండ జిల్లా నుంచే కాంగ్రెస్‌పై పోరాటం షురూ చేస్తామని, తెలంగాణ సమాజానికి పోరాటాలు నేర్పిందే నల్లగొండ జిల్లా అని అన్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా బీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదన్నారు. సూర్యాపేటలో అలాంటి అక్రమ కుమ్మక్కును బీఆర్ఎస్ తిప్పికొట్టిందని, సూర్యాపేట నుంచే తిరిగి విజయబావుటా మొదలైందన్నారు. వారం, పది రోజుల్లో గులాబీ బాస్ కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని, త్వరలోనే నల్లగొండ పర్యటనకు రానున్నారని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, యాదాద్రిభువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, పార్టీ నేతలు చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, నిరంజన్‌వలీ, పంకజ్ యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, బొర్రా సుధాకర్, తండు సైదులుగౌడ్, సహదేవ రెడ్డి, కరీంపాషా, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, శరణ్యారెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలి వచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

హామీల అమలుపై పోరాటం చేయాలి : జడ్పీ చైర్మన్

నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఫలితాలపై ఆత్మ పరిశీలన చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారని, కానీ ఇప్పుడు అమలు చేయడం అంతసులువు కాదని అన్నారు. హామీల అమలుపై ప్రజలతో కలిసి పోరాడేందుకు సిద్ధం కావాలని కోరారు. ప్రజల పక్షాన నిలబడి కష్టపడితే తిరిగి బీఆర్ఎస్‌దే అధికారమన్నారు.

సమన్వయంతో ముందుకు : రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో విఫలమయ్యామన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుందామని, రానున్న ఐదేళ్లు కష్టపడితే మళ్లీ మనదే అధికారం అని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకోసం అందరం సమన్వయంతో ముందుకు సాగుదామని చెప్పారు.

కలిసికట్టుగా సాగుదాం : కంచర్ల

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా సాగుదామని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు అందరం కలిసి పనిచేద్దామని, చిన్న చిన్న తగాదాలు పక్కన పెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు సంస్థాగతంగా అన్ని కమిటీలు వేసుకుందామని చెప్పారు. కాంగ్రెస్ దాడులను ఎదుర్కొని కార్యకర్తలను కాపాడుకుందామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

పారపాట్లను సరిదిద్దుకుందాం : గాదరి కిశోర్

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ప్రజలను తప్పుపట్టకూడదని, పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణాలను విశ్లేషించుకోవాలని అన్నారు. జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగుదామని చెప్పారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

నల్లగొండను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా

- మొదటి సంతకం ముషంపల్లి రోడ్డు విస్తరణపైనే పెట్టా
- స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకు అవకాశం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన

నల్లగొండ సిటీ, జనవరి 27 : నల్లగొండ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలో చిల్డ్రన్, వృద్ధుల ఆశ్రమ భవనాలకు శంకుస్థాపనతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్, లేడీస్ టైలరింగ్ యూనిట్స్ ప్రారంభోత్సవాలు, ముషంపల్లిలో రూ. 99.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సొరంగ మార్గం పూర్తయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఏఎమ్మార్పీ కాల్వలకు లైనింగ్ లేక పోవడంతో నీళ్లు రావడం లేదని, మెయిన్ కెనాల్ లైనింగ్ కోసం రూ.510కోట్లతో పాటు డి-25, డి-22 డిస్ట్రిబ్యూటర్ల లైనింగ్ కోసం రూ.310 కోట్లతో నెలలోగా టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు. అంతకు ముందు పానగల్‌లో రూ.1.35 కోట్లతో నిర్మించనున్న బాలసదనం, రూ.50 లక్షలతో నిర్మించనున్న వయోవృద్ధుల వసతి గృహం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రేణుకా ఎల్లమ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దర్వేశిపురంలో వాయులేరు వాగుపై రూ.12.40 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్, న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, డైరెక్టర్ రాజిరెడ్డి, జడ్పీటీసీ లక్ష్మయ్య, తాసీల్దార్ జ్యోతి, ఆలయ చైర్మన్ అలుగుబెల్లి నర్సింహారెడ్డి, జడ్పీటీసీ చిట్ల వెంటేశం, నాయకులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలు పెంచుకోవాలి

యువత నైపుణ్యాలను పెంచుకొని జీవితంలో స్థిరపడాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రూ. 20 కోట్ల ఏర్పాటు చేయనున్న జిల్లా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం భవన నిర్మాణ పనులు శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు, కోర్సులకు కావాల్సిన పరికరాల విషయంలో రాజీ పడమని స్పష్టం చేశారు.

కక్షిదారులకు సత్వర న్యాయం

• హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్

సూర్యాపేటలీగల్, జనవరి 27 : కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే ధ్యేయంగా పని చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ సూచించారు. శనివారం ఆయన జిల్లా కోర్టును సందర్శించారు. న్యాయస్థానంలో కోర్టు సిబ్బంది పనితీరును పరిశీలించారు. కోర్టుకు వచ్చిన జడ్జికి పోలీసులు గౌరవ వందనం అందించారు. అనంతరం సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.అమరావతి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులతో కలిసి కోర్టులను పర్యవేక్షించారు. ఆహ్వానం మేరకు న్యాయవాదుల విశ్రాంతి భవనంలో కొద్దిసేపు న్యాయవాదులతో మాట్లాడారు. కోర్టుల్లోని సమస్యలతో పాటు కొత్త కోర్టుల ఆవశ్యకతను జస్టిస్ కార్తీక్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్ వివరించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జడ్జి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూర్యాపేట, హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జీలు పి.శ్రీవాణి, జె.శ్యాంకుమార్, సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జీలు కె.సురేశ్, జె.ప్రశాంతి, కోదాడ న్యాయమూర్తులు భవిష్యత్‌కోహి, హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ ద్వారం వద్ద హైకోర్టు జడ్జి కార్తీక్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు

పిల్లలమర్రి శివాలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

సూర్యాపేట రూరల్ : పిల్లలమర్రి గ్రామంల